క్లుప్తంగా

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

కొయ్యూరు: మండలానికి చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ గురువారం తెలిపారు.ఈ శిక్షణకు విధిగా సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

జీసీసీ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా వీరభద్రరావు

కొయ్యూరు: మండలంలోని కాకరపాడు పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా బండారు వీరభద్రరావును నియమించారు. గూడెం కొత్తవీధిలోని జీసీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి, జీసీసీ ఆధ్వర్యంలో కాకరపాడులో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ధర్మరాజును గూడెం కొత్త వీధికి బదిలీ చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వీరేంద్రప్రసాద్

గూడెంకొత్తవీధి: మండలంలోని లక్కవరపుపేట సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్ గురుగవారం కె.కొడిసింగిలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఆయన మాట్లాడుతూ రహదారి పూర్తయితే గ్రామస్తులకు కొంత వరకు కష్టాలు తొలగుతాయన్నారు. నాయకులు, స్థానికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ దుకాణం తొలగింపునకు చర్యలు



తొలగించిన దుకాణం ముందు భాగం వద్ద రెవెన్యూ, సిబ్బంది, స్థానికులు

కొయ్యూరు: కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న చికెన్ దుకాణం తొలగించాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు.ఈ మేరకు గురువారం వీఆర్‌వో సత్యనారాయణ తమ సిబ్బందితో షెడ్డు తొలగింపు పనులు చేయించారు. ఇందులో భాగంగా షెడ్ ముందు భాగాన్ని రెవెన్యూ అధికారులు తొలగించారు. చికెన్ దుకాణం వల్ల విద్యార్థుల ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల కొయ్యూరులో పర్యటించిన ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందించి దుకాణం తొలగింపునకు ఆదేశాలు జారీ చేయడంతో గురువారం షెడ్డు తొలగింపు ప్రక్రియ చేపట్టారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పిండికొండవీధి పాఠశాలను సందర్శించిన తహసీల్దార్ శ్రీనివాసరావు

గంగవరం: మండలంలోని లక్కొండ పంచాయతీ పిండికొండవీధి గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం, మెనూ అమలుపై హెచ్ఎం రాంబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచాలని సూచించారు. విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వీఆర్వో రామలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసు తదితరులున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చెస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వి.ఆర్.పురం: మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలో 450 వరద బాధిత కుటుంబాలకు విశ్వ ప్రగామి వయోజన సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు గురువారం పంపిణీ చేశారు. చింతరేవుపల్లి, గుండుగూడెం, అన్నవరం, చొక్కనపల్లి, వడ్డుగూడెం కాలనీ గ్రామాల్లో ఒక్కో కుటుంబానికి రూ.2500 విలువ చేసే 25 కిలోల బియ్యం, రెండు లీటర్ల వంటనూనె, రెండు కేజీల కందిపప్పు, రెండు కేజీల పంచదార, టీపొడి, సబ్బులు, టూత్‌పేస్ట్ తదితర వస్తువులను గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. శివరెడ్డి, స్టీఫెన్, నానాజీ, జయరావు తదితరులు పాల్గొన్నారు.

దారాలమ్మా.. మన్నించుమా!

- పునర్నిర్మాణానికి నోచుకోని దారాలమ్మ ఆలయం
- వర్షం పడితే గర్భగుడిలో చేరుతున్న నీరు
- అసౌకర్యం నడుమ భక్తుల దర్శనాలు
- మరుగుదొడ్లు, వంట షెడ్లు, తాగునీరు లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ఆలయ గర్భగుడిపై కప్పిన టార్పాలిన్



అమ్మవారి ఆలయ ముఖద్వారం

సీలేరు: భక్తుల ఆరాధ్య దైవం...కోర్కెలు తీర్చే కల్పవల్లి..ఈ ప్రాంత గిరిజనుల కులదేవత..రాష్ట్ర భక్తులతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల భక్తుల ఆరాధ్య దైవం... దారాలమ్మ అమ్మవారు.. సుమారు 70 సంవత్సరాలుగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం.. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయంలో ఉన్న అమ్మవారు భక్తులు కోరుకునే కోరికలు తీర్చే తల్లిగా భక్తులు కొలుస్తుంటారు. తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఎంతో పేరొందిన అమ్మవారి ఆలయంలో సమస్యలతో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు.

నిలువ నీడ కరువు

అమ్మవారి ఆలయానికి కనీసం నిలువ నీడ లేకుండా పోయింది. దశాబ్దాల కాలం కిందట నిర్మించిన ఆలయమే నేటికీ ఉండడంతో చిన్నపాటి వర్షం పడితే గర్భగుడి అమ్మవారిపై వర్షపు నీరు పడి ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ పునర్నిర్మాణం చేపడతామని సంవత్సరాలుగా అధికారులు చెబుతున్నా ఒక్క పని కూడా ముందుకు సాగడం లేదు. ఆలయ గోపురం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని వర్షం నీరు గోపురం నుంచి గర్భగుడిలోకి చేరుతోంది. ఆలయం శ్లాబ్ చుట్టూ పెచ్చులు ఊడిపోతున్నాయి. పలుమార్లు శ్లాబ్ పెచ్చులూడి భక్తులపై పడిన సంఘటనలున్నాయి. అయినా అధికారులు పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు అని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయం పునర్నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరైనట్టు అధికారులు ప్రకటించి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ గోపురానికి ఇప్పటికీ టార్పాలిన్ కప్పి ఉంచారు. ఇది చూసిన భక్తులు ఆగ్రహం చెందుతున్నారు.

అసౌకర్యాలతో భక్తులు సతమతం

దారాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఏటా వేల సంఖ్యల్లో భక్తులు తరలివస్తుంటారు. వారానికి మూడు రోజులు ఆలయం వద్ద భక్తులు బారులు తీరుతారు. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. ఇక్కడ కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఆలయానికి లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా కనీస సదుపాయాలు కల్పించడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం ఆరు గదులు మాత్రమే ఉన్నాయి. తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం, వంటలు చేసేందుకు షెడ్డులు వంటి సౌకర్యాలు కనీసం లేవు. ఆలయం ప్రాంగణంలో చెత్తా చెదారాలతో నిండి ఉండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంట షెడ్డు లేక ఎండైనా..వానైనా ఆరుబయటే భక్తులు వంటలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మహిళలు పడుతున్న పాట్లు వర్ణనాతీతమని చెబుతున్నారు. పార్కింగ్ సమస్య మరింతగా వేధిస్తుంది. ఆలయం చెంతనే ఉన్న గదులు దారుణంగా ఉన్నాయి. ఇక్కడ తరచూ మందుబాబులు తిష్టవేసి, నానా రభస చేస్తుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు చెబుతున్నారు.



షెడ్లు లేక ఆరుబయట ఎండలో వంటలుచేస్తున్న భక్తులు



అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

నిర్వహణ అస్తవ్యస్తం

దారాలమ్మ ఆలయానికి ఆదాయం అధికంలోని వస్తుంది. ఆలయానికి వచ్చిన ఆదాయాన్ని నెలకు ఒకసారి లెక్కించి డబ్బుని ఎండోమెంట్ అధికారులు తీసుకు వెళ్తున్నారు. కనీసం అభివృద్ధి చేయడంటం లేదని ఆరోపణ ఎప్పటినుంచో ఉంది. అది కాకుండా స్థానికంగా ఆలయ భద్రతకు ఎండోమెంట్ అధికారులు చేతులెత్తేశారు. ఈ ఆలయానికి ఈవో మినహా ఏ ఒక్క అధికారి కూడా నియమించలేదు. దీంతో వచ్చిన ఆదాయం ఏమైపోతుందోనని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. అమ్మవారికి డబ్బుతో పాటు బంగారం, వెండి వస్తువులు కూడా భక్తులు వితరణగా ఇస్తుంటారు. అయితే స్థానికంగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆయా వస్తువులను హుండీలో వేస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. ఏటా ఏప్రిల్‌లో నిర్వహించే అమ్మవారు జాతర సమయంలో దేవదాయ శాఖాధికారులు వస్తుంటారని, మిగిలిన సమయాల్లో వారి జాడ ఉండదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



కాలకృత్యాల కోసం ఆలయం నుంచి దూరంగా వెళ్తున్న భక్తులు

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

సుమారు 70 సంవత్సరాల కిందట నిర్మించిన దారాలమ్మ తల్లి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. అధికారుల స్పందించి తక్షణమే ఆలయాన్ని పునర్నిర్మాణ పనులు చేపట్టాలి. ఆలయ అభివృద్ధికి వెచ్చించిన రూ.50 లక్షలు నిధుల వివరాలను బహిరంగంగా ప్రకటించాలి. తక్షణమే ఆలయ అభివృద్ధి పనులు చేయాలి.

– రాజు,దారకొండ సర్పంచ్, సీలేరు

తప్పని అవస్థలు



ఆలయం పరిసరాల్లో కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మన రాష్ట్రంతో పాటు వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి ఆలయం వద్ద కనీస సదుపాయాలు లేవు. తక్షణమే మరుగుదొడ్లు, వంట షెడ్లు, తాగునీటి సదుపాయం కల్పించాలి. మహిళల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించాలి.

– రాజేష్, భక్తుడు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

చింతూరు: విద్యుత్‌లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం చింతూరులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ, 11 కేవీ లైన్‌లో విద్యుత్ తీగలపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను తొలగింపు పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు చింతూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎటపాక: ఎటపాక విద్యుత్ సబ్‌స్టేషన్ రాజుపేట ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవి విద్యుత్ లైన్లో చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో ఫీడర్ పరిధిలోని ఎటపాక, రాజుపేట, మేడువాయి, బొజ్జిగుప్ప, గంగవరం, చెన్నంపేట, చింతలగూడెం, సీతంపేట, గుండువారిగూడెం, పిచుకలపాడు, చదలవాడ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



నెల్లిపూడి పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం: మండలంలోని నెల్లిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన, నిర్వహణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు ఉపాధ్యాయులను సూచించారు. ప్రణాళికబద్ధంగా బోధన జరగాలన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న ఎంపీపీ సీతమ్మ



పోషకాహారాల ప్రదర్శన



పెదబయలులో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీవో స్రవంతి తదితరులు



కోరుకొండలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సౌజన్య



జడ్డంగిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది



కొమరవరంలోని మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

ముంచంగిపుట్టు: జిల్లా వ్యాప్తంగా పోషణ మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. పోషణ్ మహ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవోలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహార కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. దీంతో తల్లి, బిడ్డకు సురక్షితమన్నారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు వంటి ఆహారాలను రోజూ తీసుకోవాలన్నారు. ఆహారంలో నూనె, పంచదార, ఉప్పులు వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు.వాటి వినియోగం వలన ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. గర్భిణులు తరచూ వైద్యపరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో ధర్మారావు, సీడీపీవో విమల కుమారి, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో స్రవంతి, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఏవో పూర్ణయ్య,ఎంఈవో-2 పుష్ప జోషప్, వైస్ సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని తాజంగి క్లస్టర్ పరిధిలోని కోరుకొండలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌజన్య, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కొమరవరం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, సూపర్‌వైజర్ అమ్మిరాజు, నాయకుడు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



ఉపాధ్యాయుల పనితీరుపై ఎంఈవోను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: రెవెన్యూశాఖ పనితీరు సక్రమంగా లేదని, పనుల కోసం రైతులు కార్యాలయం చుట్టూ తీరుగుతున్నారని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు.మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది.మండల విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి విద్యాశాఖ పనితీరుపై వివరిస్తూ ఉండగా భవనాలు లేని పాఠశాలలు, సక్రమంగా విధులకు వెళ్లని ఎంటీఎస్ ఉపాధ్యాయుల పనితీరుపై ప్రశ్నలు కురిపించారు. పాఠశాలలకు భవనాలు లేక పాకలో గిరిజన చదువులు కొనసాగించవలసిన దుస్థితి నెలకొందని, నూతన భవనాలు మంజూరైనట్టు ప్రకటించినా నేటికి పనులు ప్రారంభం కాలేదని సభ్యులు ఎంఈవోను నిలదీశారు. విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంఈవో తెలిపారు.అనంతరం స్థానిక సీహెచ్‌సీ,లబ్బూరు,కిలగాడ పీహెచ్‌సీలలో వైద్య సేవలు,సిబ్బంది కోరత, అంబులెన్స్ అందుబాటులో ఉండకపోవడం, నెలకొన్న సమస్యలు, గ్రామస్థాయిలో వైద్య సేవల పరిస్థితిపై వైద్య సిబ్బందిని సభ్యులు నిలదీశారు. రెవెన్యూశాఖా జరగాల్సిన పనులు సక్రమంగా జరగడం లేదని,కొత్త రేషన్ కార్డులు మంజూరు కాలేదని, స్మార్ట్ కార్డులలో పేర్లు తేడాలు ఉన్నాయని, మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ ఊసే మర్చిపోయారని, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఏజెంట్ల ద్వారా పనులు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో తీరు మార్చుకోకపోతే కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని సభ్యులు హెచ్చరించారు. హౌసింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని హౌసింగ్ ఏఈ కృష్ణరావును సభ్యులు ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని,అభివృద్ధి పనులపై సర్పంచులు, ఎంపీటీసీలను భాగస్వామ్యం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, ముఖ్యంగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో అంబులెన్స్‌లు నిత్యం రోగులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, ఎంపీడీవో ధర్మారావు, విద్యుత్‌శాఖ ఏఈ సురేష్, సీడీపీవో విమలకుమారి, ఏవో మురళీకృష్ణ, ఏపీఎం కళావతి తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన సమస్యలు

ముంచంగిపుట్టు:లబ్బూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నీటి సమస్యతో విద్యార్థులు స్నానాలు చేయలేని పరిస్థితి నెలకొందని గిరిజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలో జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశం మందిరం ఎదుట స్థానికంగా నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకొని ఆందోళన చేశారు.నీటి సమస్య తీర్చాలని, కూటమి ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షాన పిల్లలను ఇళ్లకు తీసుకొని వెళ్తామని పలు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం.శ్రీను మాట్లాడుతూ లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో 460 మంది విద్యార్థులు నీటి సమస్యతో అల్లాడుతున్నారని, చాలీచాలని నీటి సరఫరాతో స్నానాలు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. నీటి పథకాలు ఏర్పటు చేసి విద్యార్థుల నీటి కష్టాలు తీర్చాలని,ఉన్నత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని ఆయన కోరారు.దీనికి స్పందించిన ఎంపీడీవో ఆందోళన చేస్తున్న నేతలు, విద్యార్థులతో మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసి, నీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఏకలవ్య పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఎంపీడీవోకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రామదాసు, గిరిజన సంఘం నేతలు నర్సింగరావు, గాసిరాందొర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం



సమావేశ మందిరం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అడ్డతీగల: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని అడ్డతీగల మండలం పెద్దమునకనగడ్డలో గురువారం ఆదివాసీ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మన ఆరోగ్యం.. మన సంతోషం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆదివాసీ చైతన్య సంఘం ప్రతినిధులు భవాని, సర్వసతి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సహజ సిద్ధంగా అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పెద్దమునకనగడ్డలో ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు, ఆదివాసీ చైతన్య సంఘం సభ్యులు

ఆదివాసీ సంప్రదాయ, సాంస్కృతిక రక్షణకు కృషి చేస్తామని స్థానికులు ప్రతిజ్ఞ చేశారు.

నకిలీ మద్యం విక్రయిస్తే చర్యలు

ఎటపాక: నకిలీ మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ విజయలక్ష్మి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాన్నామన్నారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించవచ్చన్నారు. మద్యం బాటిల్‌పై ఉన్న క్యూర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మద్యం తయారీ తేదీ, ధర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. నకిలీ మద్యం విక్రయిస్తే 14405 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఇన్‌చార్జి ఎస్ఐగా చరణ్‌నాయక్



మోతుగూడెం: మోతుగూడెం పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐగా చరణ్‌నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్ఐ సాదిక్ స్థానంలో ఇన్‌చార్జి ఎస్ఐగా నియమించారు. ప్రస్తుతం ఆయన మెడికల్ లీవ్‌లో ఉన్నారు. నూతనంగా విధుల్లో చేరిన ఎస్ఐ ఇటీవల ట్రెనింగ్ పూర్తి చేసుకొని చింతూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి తదితరులు

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యా విధానాలు, కొత్త కోర్సులపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి మాట్లాడుతూ చదువుపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. అరకులోయ, నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్ నాయక్, ఎస్.రాజులు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మరింత నైపుణ్యం సాధించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ రసూల్, సిబ్బంది కోటేశ్వరరావు, గౌరిశంకర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చెత్త చెదారాలు పెరుకుపోవడంతో సర్పంచ్ మంగా బొజ్జయ్య స్పందించి తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ రహదారి మీదుగా స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారని, చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దుర్గంధంతో ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ బొజ్జయ్య, డీపీవో చంద్రశేఖర్ తక్షణమే స్పందించారు. చెత్త తొలగింపు పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.



చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ బొజ్జయ్య, డీపీవో చంద్రశేఖర్ తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన

గూడెంకొత్తవీధి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వరప్రసాద్, ఎస్ఐ సురేష్ స్థానికులకు సూచించారు. మండల కేంద్రంలో వారు గురువారం సైబర్ నేరాలు, ఆన్‌లైన్ యాప్ లోన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది పేరుతో మోసపూరిత ఫోన్‌లు వచ్చినా, ఓటీపీలు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు, ఏటీఎం పిన్ నంబర్లు అడిగినా ఎవరూ చెప్పవద్దని, యాప్ లోన్స్‌తో అప్రమత్తం ఉండాలని సూచించారు.



మానవహారం చేపట్టిన స్థానికులు, పోలీసులు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

అడ్డతీగల: అడ్డతీగలలో జిల్లా పంచాయతీ అధికారి కె.చంద్రశేఖర్ గురువారం పర్యటించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణను క్రమం తప్పకుండా చేయాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యంపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో కె.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ తదితరులు